క్లుప్తంగా

కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బండ రావిరాల గ్రామంలో గల శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కిషన్‌గౌడ్, ఎంపీటీసీ అనిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కొత్త అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజున ఉదయం భక్తుల సమక్షంలో రథోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోన శ్రీనునాయక్, ఎంపీటీసీ పంతునాయక్, ఆలయ నిర్వాహకులు నర్సిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మల్లప్ప, పంచాక్షరి, వీరయ్య, గోవింద్‌యాదయ్య, శ్రీపాతి యాదగిరిరెడ్డి, వైద్యనాద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంపత్‌కుమార్‌కు సన్మానం



సంపత్‌కుమార్‌ను సన్మానించిన చెన్నకేశవులు

తలకొండపల్లి: కడ్తాల్ మండలంలోని మైసమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌ను మంగళవారం కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు చెన్నకేశవులు ఘనంగా సన్మానించారు. తలకొండపల్లి మండల దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. వారి జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని కోరారు.

24 నుంచి బ్రహ్మోత్సవాలు



శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నేతలు

తలకొండపల్లి: శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రాగలరని శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, జున్ను సోలార్ చైర్మన్ శేఖర్ రెడ్డికి మాజీ సర్పంచ్ శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందజేశారు. మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 24న ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా అంత రాష్ట్రీయ బండలాగుడు ఎద్దుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ తదితర బహుమతులను టౌన్‌షిప్ చైర్మన్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, సోలార్ చైర్మన్ శేఖర్‌రెడ్డి అందజేయనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, సత్యం, జంగయ్య, లక్ష్మయ్య, యాదయ్య, శంకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన భవానీ రాములు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి రూ.8వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక నాయకులుల యాదగిరిరెడ్డి, రాంచందర్ నా యక్, మల్లేశ్‌గౌడ్, జహంగీర్‌అలీ, మల్లయ్య, భిక్షపతి, కుమార్, రాజేశ్,శ్రీకాంత్, భానుకిరణ్, ప్రవీణ్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

నామ్‌కే వాస్తే..

- ధరణి స్పెషల్ డ్రైవ్‌లో కక్షిదారులకు నిరాశ
- సమస్యలు పరిష్కరించేందుకు లాగిన్ కాని వెబ్‌సైట్
- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న రెవెన్యూ సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: రెవెన్యూ శాఖలో భూములకు సంబంధించి ఏర్పాటు చేసిన ధరణి వెబ్‌సైట్‌తో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ నామమాత్రంగా కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్‌ఎస్ హయాంలో భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ఒకరి భూములు మరొకరిపై, సర్వే నంబర్లు తప్పుల తడకగా, కొందరికి తక్కువగా మరికొందరికి ఎక్కువగా పట్టాదారు పాసు పుస్తకాల్లో భూముల నమోదు తదితర సమస్యలు కోకొల్లలుగా ధరణి పోర్టల్‌తో తలెత్తాయి. ఈ సమస్యలను పరిష్కరించాలంటే తహసీల్దార్ చేతుల్లో ఎలాంటి ఆప్షన్ లేకుండా జిల్లా కలెక్టర్‌కు అధికారాన్ని కట్టబెట్టారు. దీంతో కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ రైతులు చెప్పులరిగేలా తిరిగారు. తమ అవసరాలకు భూమలను విక్రయించుకునేందుకు సైతం వీలుకాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

నూతన ప్రభుత్వంలోనైనా..

అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారానికి ఒక కమిటీని వేసింది. అందుకు అనుగుణంగా ఈనెల 1 నుంచి 17వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 3వేలకుపైగా పెండింగ్ భూసమస్యలున్నట్లు ఇప్పటివరకు గుర్తించారు. అందులో 650 సమస్యలు పరిష్కరించేందుకు ఫైళ్లను అధికారులు సిద్ధం చేశారు. అయితే ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో వెబ్‌సైట్ లాగిన్ కావడంలేదు. ఎప్పటి మాదిరిగానే సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా టీఎం–33 సమస్యల పరిష్కారానికి అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. పేరు మార్పిడి, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం తప్పుగా నమోదు కావడం, ఒకరి భూమి మరొకరి సర్వేనంబర్‌లోకి వెళ్లడం తదితర సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపేందుకు సిద్ధం చేశారు.

లాగిన్‌కు అనుమతి రాలేదు..

ధరణి సమస్యలు పరిష్కరించేందుకు తమకు లాగిన్ ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీంతో స్పెషల్ డ్రైవ్‌తో తమ భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశే మిగులుతోంది. ప్రతిరోజు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమ చేతుల్లో ఏమీలేదని లాగిన్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే సమస్యలు పరిష్కరించగలమని రెవెన్యూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారని రైతులు అంటున్నారు. అయినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించాల్సిందే అని కొందరు రైతులు పట్టుబడుతుండటంతో సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సర్వేనంబర్ 79లోని 30 గుంటల భూమి మా నాన్న శంకరయ్య పేరుపై ధరణిలో నమోదు కాలేదు. టీఎం–33 కింద దరఖాస్తు చేసుకొని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. రాష్ట్రంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిపై స్పెషల్ డ్రైవ్ పెట్టడంతో మా సమస్యలు పరిష్కారం అవుతాయని గంపెడాశతో ఉన్నాం.

– శ్రీకాంత్, ఖానాపూర్

రెండేళ్లుగా తిరుగుతున్నాం



రాయపోల్‌లో మా సోదరి పేరుమీద తొమ్మిది ఎకరాల 13 గుంటల భూమి కొనుగోలు చేసుకోని ప్రొసీడింగ్ తీసుకున్నాం. కాని ధరణి పట్టాదారు పాసు బుక్కులో 38 గుంటల భూమిని తక్కువగా నమోదు చేశారు. సుమారు రెండేళ్లుగా సమస్య పరిష్కారం కోసం తిరుగుతున్నాం. స్పెషల్ డ్రైవ్‌లోనైనా సమస్య పరిష్కరించాలి.

– లక్ష్మణ్, రాయపోల్

మూడు వేలకు పైగా సమస్యలు



ధరణిలో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. మండలంలో మూడు వేలకు పైగా ధరణి సమస్యలున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆయాసమస్యలను భూరికార్డుల వారిగా పరిశీలిస్తున్నాం. 650 సమస్యలు పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం లాగిన్‌కు అనుమతి ఇవ్వగానే వీటిని పరిష్కరిస్తాం. మరికొన్ని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సునీత, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ



ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా మున్సిపల్ లేదా హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఇప్పటికే మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలు చేపడుతన్నవారికి నోటీసులు జారీ చేశామని, పనులు కూడా నిలిపివేశామని తెలిపారు. అలాగే మున్సిపాలిటీలో రూ.3.43 కోట్ల పన్నులు వసూళ్ల డిమాండ్ ఉందన్నారు. ఇప్పటివరకు రూ.2.46 కోట్లు వసూలు చేశామన్నారు. మరో రూ.9.6 కోట్లు చేయాల్సి ఉందన్నారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేయడానికి అందరూ సహకరించాలని కోరారు.

బీజేపీ విజయం ఖాయం



కడ్తాల్ నుంచి తరలివెళ్తున్న నేతలు

విజయసంకల్ప సభకు తరలివెళ్లిన నేతలు

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాన్యానాయక్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనానికి మండల కేంద్రం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రెడ్యానాయక్, శ్రీశైలంగౌడ్, సాయి ప్రభు, వెంకటేశ్, పవన్‌కుమార్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, అంజయ్య, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు నుంచి..

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనానికి ఆమనగల్లు మండలం నుంచి పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో నాయకులు తరలివెళ్లారు. కల్వకుర్తి బీజేవైఎం కన్వీనర్ పద్మ అనిల్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రవిరాథోడ్, ఆమనగల్లు మీడియా కన్వీనర్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు నుంచి తరలివెళ్తున్న నాయకులు

తలకొండపల్లి మండలం నుంచి..

తలకొండపల్లి: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనానికి మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. నాయకులు కుమార్, యాదయ్య, రాజు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, హరికాంత్, కృష్ణ తదితరులున్నారు.

మీర్‌పేటలో ఆధార్ నమోదు కేంద్రం

మీర్‌పేట: మీర్‌పేట పీఎస్ ఆవరణలోని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వికల్ప్ సెంటర్‌లో మీర్‌పేట పోలీసుల సహకారంతో మంగళవారం ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రత్యేకంగా ముషీరాబాద్ ఆధార్ రీజినల్ సెంటర్ వారిచే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, క్యాంపులో 110 మంది ట్రాన్స్‌జెండర్లు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, సర్టిఫికెట్ కోసం.. అదే విధంగా ఉపాధి, స్వయం ఉపాధి కోసం మరో 17 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలోని మిగతా ట్రాన్స్‌జెండర్లు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ సుధాకర్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అహ్మద్ అలీ,ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్, చంద్రయ్య, వికల్ప్ సెంటర్ కోఆర్డినేటర్ సంజీవులు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయికుమార్ పాల్గొన్నారు.



ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ కాశీవిశ్వనాథ్

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్



ఆమనగల్లు: ఆర్యవైశ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అయినప్పటికీ గతంలోని ప్రభుత్వాలు ఆర్యవైశ్యుల గురించి ఏనాడు పట్టించుకోలేదని.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

మాడ్గుల: మాడ్గుల మాజీ సర్పంచ్ సూదిని సునీత కొండల్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాదులోని బృంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలియడంతో ఆమనగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

తలకొండపల్లి: మార్ల ప్రభు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో మార్ల ప్రభు (45) మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి చౌదర్‌పల్లికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రయ్య, రవికిరణ్‌రెడ్డి, బాల మైసయ్య, శ్రీను నరేందర్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్



ఇబ్రహీంపట్నం: ఇంటి పన్నుల విషయంలో ఎలాంటి తప్పులున్నా సరిచేసుకునేందుకు రెవెన్యూ మేళాను నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. మార్చి నెలలోని ప్రతి గురు, ఆది, మంగళవారల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో ఈ మేళాను నిర్వహిస్తామని తెలిపారు. ఇంటి పన్నుల విషయంలో ఏవైనా తప్పులుంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



తలకొండపల్లి: ఉపాధ్యాయులతో మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

తలకొండపల్లి: మండల పరిధిలోని మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి చక్కగా పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా శృతి, డీఈఓగా అక్షయ, ఎంఈఓగా నందిని, కాంప్లెక్స్ హెడ్మాస్టర్‌గా సుష్మతో పాటు, 12 మంది విద్యార్థులు వివిధ నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులందరూ క్రమ శిక్షణతో మెలుగుతూ చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్ నాయక్, హెచ్‌ఎం శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు విష్ణుగౌడ్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పర్వతాలు, శంకర్, రమేష్‌రెడ్డి, విక్రమ్ కుమార్‌రెడ్డి, శోభారాణి, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా అంజలి, ఉపాధ్యాయులుగా ప్రవళిక, విరీష, రాకేశ్, అశ్విని, వైష్ణవి, ఇవాంజిల్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు, ఉపాధ్యాయురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొనసాగుతున్న ఉత్కంఠ

- పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాస కేసుపై తీర్పును రిజర్వు చేసిన కోర్టు
- నిర్ణయం వెలువడే వరకు కొనసాగనున్న సుదర్శన్‌రెడ్డి



ఉప్పరిగూడ పీఏసీఎస్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ టీకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస సమావేశ వివరాలు న్యాయస్థాన పరిధిలో ఉండటంతో ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. శేరిగూడలోని ఉప్పరిగూడ పీఏసీఎస్ డైరెక్టర్లు 11 మంది.. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు అందజేయగా.. ఈ అవిశ్వాస సమావేశాన్ని గతనెల 22న డీసీఓ ధాత్రిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. తనపై పెట్టిన అవిశ్వాస ప్రక్రియ సరైన పద్ధతిలో లేదని చైర్మన్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అవిశ్వాస సమావేశానికి ముందు న్యాయస్థానం కొన్ని కండిషన్లతో దీనిపై స్టే విధిస్తూ ఆదేశాలు జారిచేసింది. ఈ సమావేశంలో నిర్వహించిన వివరాలు గోప్యంగా ఉంచి, న్యాయస్థానానికి సమర్పించాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఈనెల 7న న్యాయస్థానంలో దీనిపై విచారణ జరగగా తిరిగి 12వ తేదీకి వాయిదా వేసింది. మంగళవారం జరిగిన విచారణలో వాదోపవాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు ఫర్ ఆర్డర్‌లో పెట్టింది. దీంతో న్యాయస్థానం తీర్పును వెలువరించేంతవరకు ఈ వ్యవహారం సస్పెన్స్‌గానే ఉండనుంది. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నవారిలో నిరాశ, నిస్పృహ చోటుచేసుకుంటున్నాయి. న్యాయస్థానం తీర్పు ఎలా ఉంటుందోనని ఆందోళనకు గురవుతున్నారు. న్యాయస్థానంలో ఈ వ్యవహారం పెండింగ్ ఉండటంతో అప్పటివరకు సుదర్శన్‌రెడ్డే చైర్మన్‌గా కొనసాగనున్నారు.

సురక్షిత తాగునీటిని అందిస్తాం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



విందులో పాల్గొన్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: కడ్తాల్ మండల పరిధిలోని గ్రామాల్లో రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మసీద్ కుబా, మసీద్ అర్షద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాడి పంటలతో, సుఖ సంతోషాలతో అందరూ శాంతియుతంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పాత మజీద్ వద్ద ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు ఉపవాస దీక్షను విరమించిన ముస్లిం సోదరులకు పలహారం అందించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం మొత్తం ఉపవాస దీక్షల సందర్భంగా సురక్షిత తాగునీటిని అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, నాయకులు రాంచంద్రయ్య, భిక్షపతి, వెంకటేశ్, మహేశ్, చెన్నయ్య, సురేశ్, బాబు, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

ధరణిపై మాట్లాడే అర్హత మీకు లేదు

బీఆర్‌ఎస్ నేతలపై టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు జంగారెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: ధరణి వెబ్‌సైట్ తెచ్చి రైతుల్ని నట్టేట ముంచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, నాయకులకు మాట్లాడే అర్హతే లేదని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మంగళవారం కందుకూరులో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి సమస్యలు ఎందుకు పరిష్కరించలేకపోయిందని ప్రశ్నించారు. 30 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టడంతో రైతుబంధు రాక, రుణాలు అందక, కనీసం అవసరానికి భూమి విక్రయించలేక రైతులు నానా అగచాట్లు పడ్డారన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుంటే.. దొంగే దొంగ అన్న చందంగా బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, గణేష్, వెంకటేష్‌గౌడ్, జగదీశ్వర్, సురేందర్‌రెడ్డి, గణేష్‌నాయక్, వెంకటేశ్, శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: మండల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.33 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం వారు ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, నాయకులు మంద పాండు, బాబురావు పాల్గొన్నారు.